


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
శుక్రవారం
01-08-2025
పేజీలు: 02




# యూపీఐలో కీలక మార్పులు

డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో కీలకమైన యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ఫేస్‌లో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. ఆగస్టు 1 నుంచి ఎన్‌పీసీఐ కొత్త రూల్స్ అమల్లోకి వచ్చాయి. బ్యాలెన్స్ చెక్, ఆటో పేమెంట్‌కు సంబంధించిన కొన్ని నిబంధనలు మారాయి. ఇవి వినియోగదారులతోపాటు బ్యాంకులు, వ్యాపారులను ప్రభావితం చేయనున్నాయి. ఎన్‌పీసీఐ కొత్త రూల్స్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. ప్రస్తుతం ఉన్నట్టు అపరిమితంగా కాకుండా ఇకపై రోజులో 50 సార్లు మాత్రమే బ్యాలెన్స్ తనిఖీ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఒకవేళ మీరు రెండు యాప్‌లను వినియోగిస్తుంటే ఈ పరిమితి వేర్వేరుగా ఉంటుంది. యూపీఐ ఆటోపే లావాదేవీలకు ఎన్‌పీసీఐ నిర్ణీత టైమ్ స్లాట్‌లను నిర్ణయించింది. సబ్‌స్క్రిప్షన్లు, ఈఎంఐలు, వినిమయ బిల్లులు లాంటి చెల్లింపులను ఇకపై పగటిపూట ర్యాండమ్‌గా కాకుండా నిర్ణీత సమయాల్లో మాత్రమే ప్రాసెస్‌కు వీలుంటుంది. అవి ఉదయం 10 గంటలకు ముందు, మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటలు, రాత్రి 9.30 గంటల తర్వాతే ప్రాసెస్ అవుతాయి. ఈ మార్పు వల్ల కస్టమర్లపై ప్రత్యక్ష ప్రభావమేమీ ఉండదు. ఎందుకంటే వారి ఆటో-పేమెంట్లు యథావిధిగా పనిచేస్తాయి. కానీ, వ్యాపారులు మాత్రం తమ పేమెంట్ కలెక్షన్ షెడ్యూళ్లను నిర్దేశిత టైమ్ స్లాట్‌లకు అనుగుణంగా తిరిగి సర్దుబాటు చేసుకోవాల్సి ఉంటుంది. యూపీఐని మరింత ఆధారపడదగినదిగా, ప్రత్యేకించి రద్దీ సమయాల్లో అంతరాయాలకు తావులేకుండా లావాదేవీలు సజావుగా సాగేలా తీర్చిదిద్దడం ఈ మార్పుల లక్ష్యం.



# రేవంత్ పాపాల పుట్ట రోజురోజుకూ పెరిగిపోతూనే ఉంది

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కాంగ్రెస్ అంటేనే మోసం, దగా, నయవంచన అని ఫార్మా సిటీ భూముల వ్యవహారంలో మరోసారి తేలిపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రేవంత్ పాపాల పుట్ట రోజురోజుకూ పెరిగిపోతూనే ఉందని చెప్పారు. అధికారంలోకి వస్తే ఫార్మా సిటీని రద్దుచేసి, భూములను తిరిగి ఇప్పిస్తామని హామీఇచ్చి, వాటిని ఇతర అవసరాలకు రేవంత్ మళ్లించడం అత్యంత నీచమైన చర్య అని విమర్శించారు. దోస్తులకు దోచిపెట్టేందుకు చీకటి ఒప్పందాలతో తెరపైకి తెచ్చిన ఫ్యూచర్ సిటీకి అక్రమంగా భూములు కేటాయిస్తే స్థానిక రైతులే కాదు.. బీఆర్ఎస్ కూడా చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. 'అల్లుడి ఫార్మా కంపెనీ కోసం కొడంగల్ లో దళిత, గిరిజనుల భూములను కొల్లగొట్టే కుట్రలను మొదలుకుని, అనుముల బ్రదర్స్ కోసం ఫ్యూచర్ సిటీ పేరిట అన్నదాతల భూములను చెరబట్టే పన్నాగాల దాకా.. రేవంత్ పాపాల పుట్ట రోజురోజుకూ పెరిగిపోతూనే ఉంది. కాంగ్రెస్ అంటేనే మోసం, దగా, నయవంచన అని ఫార్మా సిటీ భూముల వ్యవహారంలో మరోసారి తేలిపోయింది. అధికారంలోకి వస్తే ఫార్మా సిటీని రద్దుచేసి, భూములను తిరిగి ఇప్పిస్తామని హామీఇచ్చి, వాటిని ఇతర అవసరాలకు రేవంత్ మళ్లించడం అత్యంత నీచమైన చర్య. అడుగడుగునా అన్నదాతలు మర్లపడుతున్నా, ఏకంగా ఎమ్మెల్యేల ఇళ్లు ముట్టడిస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్ కు మాత్రం బుద్ధిరావడం లేదు.

# మరోసారి సుంకాలతో విరుచుకుపడిన ట్రంప్



ప్రపంచ దేశాలపై సుంకాలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి విరుచుకుపడ్డారు. 70కిపైగా దేశాలపై ఉన్న పరస్పర సుంకాలను 10 శాతం నుంచి 41 శాతం వరకు పెంచారు. ఈ మేరకు కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకాలు చేశారు. కెనడాపై ఇప్పటివరకు 25 శాతంగా ఉన్న టారీఫ్‌లను 35 శాతానికి పెంచారు. ఇక భారత్‌పై 25 సుంకాలు విధిస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించిన ట్రంప్.. అత్యధికంగా సిరియాపై 41 శాతం సుంకాలు విధించారు. వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో యూరోపియన్ యూనియన్‌కు సుంకాల విషయంలో కొంత వెసులుబాటు కల్పించారు. 15 శాతం కంటే ఎక్కువ సుంకాల రేట్లు ఉన్న వస్తువులకు కొత్త టారీఫ్‌ల నుంచి మినహాయింపునిచ్చారు.

**పరస్పర సుంకాలు ఏ దేశంపై ఎంతంటే..**

41 శాతం- సిరియా
40 శాతం- లావోస్, మయన్మార్
39 శాతం- స్విట్జర్లాండ్
35 శాతం- ఇరాక్, సెర్బియా
30శాతం- అల్జీరియా, బోస్నియా, హెర్జ్‌గోవినా, లిబియా, దక్షిణాఫ్రికా
25 శాతం- భారత్, బ్రూనై, కజకస్థాన్, మాల్డోవా, టునీషియా
20 శాతం- బంగ్లాదేశ్, శ్రీలంక, తైవాన్, వియత్నామ్
19శాతం- పాకిస్థాన్, మలేషియా, ఇండోనేషియా, కంబోడియా, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్
18 శాతం- నికరాగువా
15 శాతం- ఇజ్రాయెల్, జపాన్, టర్కీ, నైజీరియా, ఘనా, పలు ఇతర దేశాలు
10 శాతం- బ్రెజిల్, యూకే, ఫ్లాక్‌లాండ్ దీవులు

# అమ్రాబాద్ టైగర్ రిజర్వులో పులుల సంఖ్య 36కి పెంపు

నల్లమల అడవుల్లో పులుల జనాభా స్థిరంగా పెరుగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. అమ్రాబాద్ టైగర్ రిజర్వులో (ఏటీఆర్) తాజా గణాంకాల ప్రకారం ప్రస్తుతం మొత్తం 36 పులులు (13 మగ, 20 ఆడ) ఉన్నాయి. అదనంగా 2 పులి పిల్లలు కూడా గుర్తించబడ్డారు, ఇంకా ఒకటి లింగ నిర్ధారణలో ఉంది.

★మానిటరింగ్ ప్రక్రియ
2024 డిసెంబర్ 20 నుండి 2025 మే 15 వరకు జరిగిన పులుల పర్యవేక్షణ సర్వేలో, పది రేంజ్‌లను నాలుగు బ్లాక్‌లుగా విభజించి, మొత్తం 1,594 కెమెరా ట్రాప్‌లు అమర్చారు. వీటిని 797 లొకేషన్లలో, ప్రతి 2 కిలోమీటర్లకి ఒక కెమెరా చొప్పున అమర్చారు. పులుల పాదముద్రలు, విసర్జన, స్క్రాచ్ మార్కులు వంటి ప్రత్యక్ష ఆధారాల ఆధారంగా డేటాను విశ్లేషించారు. ఆడ పులుల ప్రాబల్యం — భవిష్యత్ వృద్ధికి సంకేతం ప్రస్తుతం గుర్తించబడిన 20 ఆడ పులులు, పులుల సంతానోత్పత్తికి అనుకూలమైన వాతావరణాన్ని సూచిస్తున్నాయి. అటవీ శాఖ చేపడుతున్న పరిరక్షణ చర్యల వలన వచ్చే రెండేళ్లలో పులుల జనాభా మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. వాటి వేట కోసం అవసరమైన జింకలు, దుప్పులు వంటి ప్రేయ్ జంతువుల పెంపకం పునరుద్ధరణ కొనసాగుతోంది.ఏటీఆర్ విశేషాలుఏటీఆర్ మొత్తం 2,611.39 చదరపు కిలోమీటర్లు విస్తీర్ణంలో ఉన్నదీ, ఇందులో 2,166.37 అడవిగా, మిగతా 445.02 చద.కి.మీ బఫర్ జోన్‌గా ఉంది. ఇది దేశంలో రెండో అతిపెద్ద టైగర్ రిజర్వ్. నాగర్‌కర్నూల్,



నల్లగొండ జిల్లాల వరకు విస్తరించి, పులులు, చిరుతలు, వృక్షజీవులు కలసిన జీవవైవిధ్యం నిండిన ప్రాంతం.

★పులుల గుర్తింపు విధానం పులులను చారల నమూనా ఆధారంగా గుర్తిస్తారు — ఇది మనిషి వేలిముద్రల లాగానే ప్రత్యేకం. ఫొటోగ్రాఫిక్ డేటాబేస్ తో సరిపోల్చి ప్రత్యేక ఐడీ నంబర్లు కేటాయిస్తారు.మగ-ఆడ పులులను శరీర నిర్మాణం, శృంగారపు ప్రవర్తన వంటి లక్షణాల ద్వారా గుర్తిస్తారు

★జనావాసాల తరలింపు :పులుల స్వేచ్ఛగా సంచారం కోసం కోర్ ఏరియాలోని కొన్ని గ్రామాలను తరలించేందుకు చర్యలు మొదలయ్యాయి. మొదటి దశలో సార్లపల్లి, కుడిచింతలబైలు, కొల్లంపెంట గ్రామాలను బాకారం సమీపానికి మార్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. రెండో దశలో మరికొన్ని గ్రామాలను కూడా తరలించే ప్రణాళిక ఉంది.

★వేటా, పర్యాటనపై నియంత్రణజూలై — సెప్టెంబర్ మధ్య పులుల సంతానోత్పత్తి కాలం కావడంతో, ఈ సమయంలో అటవీ ప్రవేశాన్ని నిషేధించడం జరుగుతుంది. పర్యాటకులకు అనుమతులుండదు. అంతేకాదు, ఏటీఆర్ పరిధిలో ఎకో సెన్సిటివ్ జోన్గా గుర్తించి 10 కిలోమీటర్ల పరిధిలో అభివృద్ధి పనులకు ప్రత్యేక అనుమతి తప్పనిసరిగా మారనుంది.

★అధికారుల వ్యాఖ్య "పులుల పెరుగుదల మా శాఖ రూపొందించిన వ్యూహాల ఫలితం. భద్రత, ఆహార అందుబాటుతో పాటు స్థానిక చెంచుల సహకారంతో పులులకు అనుకూల వాతావరణం ఏర్పడుతోంది."గోపిడి రోహిత్ రెడ్డి, డీఎఫ్ఓ.




# 5న విచారణకు రండి

పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ షాకిచ్చింది. రూ.17 వేల కోట్ల విలువైన రుణ మోసానికి సంబంధించిన కేసులో చోటా అంబానీకి ఈడీ సమన్లు జారీ చేసింది. ఆగస్టు 5న ఢిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయంలో విచారణకు రావాలని ఆదేశించింది. గత వారం రిలయన్స్ గ్రూప్‌తో సంబంధం ఉన్న అనేక సంస్థలు, వ్యక్తుల ప్రాంగణాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. 50 కంపెనీలు, 25 మంది వ్యక్తులకు చెందిన ముంబైలోని దాదాపు 35 చోట్ల ఈడీ దాడులు జరిగాయి. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ దాఖలు చేసిన రెండు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ ఈ చర్యలు చేపట్టింది. 2017-19 మధ్య యస్ బ్యాంక్ నుంచి అనిల్ అంబానీ దాదాపు రూ.3 వేల కోట్ల రుణం తీసుకొని దారి మళ్లించారని ఆరోపణలు ఉన్నాయి. గ్రూప్ కంపెనీలకు రుణాలు ఇవ్వడానికి ముందు బ్యాంకు ప్రమోటర్లతో సంబంధం ఉన్న సంస్థలకు నిధులు బదిలీ అయ్యాయని ఈడీ ఆరోపణలు. ఈ కేసులో అనిల్ అంబానీ గ్రూప్‌తో సంబంధం ఉన్న సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లను కూడా విచారిస్తున్నారు. దాదాపు 50 సంస్థలు, 25 మందిపై కేసులు నమోదైనట్లు తెలిసింది.

# విశ్వంభర సెట్స్‌లో చిరంజీవితో మౌనీ రాయ్

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'విశ్వంభర' షూటింగ్ చివరి దశకు చేరింది. 'వాల్తేరు వీరయ్య', 'భోళా శంకర్' తర్వాత చిరంజీవి నుంచి వస్తున్న ఈ భారీ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌పై ప్రేక్షకుల్లో, ముఖ్యంగా మెగా ఫ్యాన్స్‌లో భారీ స్థాయిలో అంచనాలు ఉన్నాయి. వింటేజ్ చిరు మేజిక్‌ను మళ్లీ వెండితెరపై చూపించే ప్రయత్నంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు.'బింబిసార' వంటి బ్లాక్‌బస్టర్ ఇచ్చిన దర్శకుడు మల్లిడి వశిష్ఠ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. 14 లోకాల్లో హీరోయిన్ కోసం హీరో చేసే యాత్రే ఈ కథ యొక్క కేంద్ర బిందువుగా తెలుస్తుంది. విశ్వంభర చిత్ర కథకు ప్రేరణగా 'జగదేక వీరుడు అతిలోక సుందరి', 'పాతాళ భైరవి', 'కీలు గుర్రం'చిత్రాలు నిలిచాయి.



# హైడ్రా కృషిని అభినందించిన కేంద్ర అధికారులు

అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటను కేంద్ర గృహా నిర్మాణ, పట్టన వ్యవహారల మంత్రిత్వ శాఖ (ఎంఓహెచ్‌యూఏ) కు చెందిన అధికారుల బృందం గురువారం సందర్శించింది. చెరువు చుట్టూ తిరుగుతూ.. అభివృద్ధిని దశలవారీ తెలుసుకుంది. ఒకప్పుడు చెత్త, నిర్మాణ వ్యర్థాలతో నిండిన ప్రాంతం చెరువులా రూపాంతరం చెందడాన్నిపాత చిత్రాలను చూసి ఆశ్చర్యపోయింది. చెరువుల పరిరక్షణకు జాతీయ స్థాయిలో బతుకమ్మ కుంట ఒక నమూనా అవుతుందని బృందానికి నాయకత్వం వహించిన కేంద్ర గృహా నిర్మాణం, పట్టన వ్యవహారల మంత్రిత్వ శాఖ అడిషనల్ చీఫ్ టౌన్ ప్లానర్ మోనీస్ ఖాన్ పేర్కొన్నారు. కబ్జాల చెర నుంచి విముక్తి కల్పించడం.., మండు వేసవిలో




రెండు మీటర్ల లోతు తవ్వగానే గంగమ్మ తల్లి ఉబికి వచ్చే వీడియోలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. హైడ్రా పనితీరు గురించి వార్తల్లో చదివాం.. నేడు క్షేత్రస్థాయిలో తెలుసుకున్నామని చెప్పారు. హైడ్రా కృషిని అభినందించారు. చెరువు చుట్టూ ఇంకా అభివృద్ధి చేయాల్సిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. చెరువు అభివృద్ధితో ఇక్కడి ప్రాంతం సుందరంగా తయారవ్వడమే కాకుండా.. ఇక్కడ భూముల ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని అన్నారు. హైడ్రా

వరద నీరు వచ్చేలా ఎలా..?

చెరువుకు ఆనుకుని సాగే మురుగు కాలువలోంచి వరద నీరు మాత్రమే వచ్చేలా ఇన్‌లెట్‌ను నిర్మించడాన్ని చూసి కేంద్ర గృహనిర్మాణ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి బృందం ముచ్చట పడింది. ఇటీవల కురిసిన వర్షాల సమయంలో వరద నీరు ఎలా వచ్చి చేరిందో వీడియాల ద్వారా హైడ్రా అధికారులు కేంద్ర బృందానికి చూపించారు. ఈ వరద నీరు గతంలో ఎటు వెళ్లేదని.. స్థానికులతో కూడా మాట్లాడి ఈ బృందం తెలుసుకుంది. వరద నీరు తమ బస్తీలను, కాలనీలను ముంచెత్తేది.. ఈ సారి ఆ వరద చెరువుకు చేరిందని చెప్పడంతో మరింత లోతుగా అధ్యయనం చేయడం ప్రారంభించింది. చెరువు ఔట్‌లెట్లను కూడా పరిశీలించింది. కేంద్ర గృహనిర్మాణ మంత్రిత్వ శాఖ అసోసియేట్ టౌన్ ప్లానర్ సందీప్ రావుతో పాటు.. హైడ్రా అధికారులు మోహనరావు, బాలగోపాల్, చెరువులను అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న విమోస్ టెక్నోక్రాట్ ఎండీ పి. యూనస్, జీహెచ్ ఎంసీ అడిషనల్ చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, సిటీ ప్లానర్ ఉమాదేవి తదితరులు కేంద్ర బృందంతో ఉన్నారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

## అసెంబ్లీలో రమ్మీ ఆడిన మంత్రి.. మారిన మినిస్ట్రీ



మహారాష్ట్ర అసెంబ్లీలో మొబైల్ ఫోన్‌లో రమ్మీ ఆడుతూ కెమెరాకు చిక్కిన వ్యవసాయ శాఖ మంత్రి మాణిక్‌రావ్ కోకాటేపై వేటు పడింది. మంత్రివర్గ పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ఆయనను వ్యవసాయ శాఖ నుంచి తప్పించి క్రీడలు, యువజన సంక్షేమ శాఖ బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుత క్రీడామంత్రి దత్తాత్రేయ భర్నేకు వ్యవసాయ శాఖ బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీ నేత అయిన కోకాటే.. నాసిక్ జిల్లాలోని సిన్నార్ నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ క్యాబినెట్‌లో వ్యవసాయ మంత్రిగా ఉన్నారు. వర్షాకాల సమావేశాల్లో భాగంగా గత నెల 20న అసెంబ్లీకి హాజరైన ఆయన.. సభలో తన మొబైల్ ఫోన్‌లో రమ్మీ ఆడుతూ కనిపించారు. ఈ వీడియోను శరద్ పవార్ ఎన్సీపీ నేత రోహిత్ పవార్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'అధికారంలో ఉన్న జాతీయవాద వర్గం బీజేపీని సంప్రదించకుండా ఏమీ చేయలేనందున, లెక్కలేనన్ని వ్యవసాయ సమస్యలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, రాష్ట్రంలో రోజూ రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నప్పటికీ, వ్యవసాయ మంత్రికి వేరే పని లేకపోవడంతో రమ్మీ ఆడటానికి సమయం దొరికినట్లు కనిపిస్తోంది' అని ఎక్స్‌లో విమర్శించారు. బీజేపీ ప్రభుత్వంపై విపక్షాలు విమర్శలు గుప్పించాయి.

## యూట్యూబ్‌లోకి వచ్చేసిన ఆమిర్ ఖాన్ 'సితారే జమీన్ పర్'



బాలీవుడ్ నటుడు, మిస్టర్ ఫర్ఫెక్ట్ ఆమిర్‌ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన 'సితారే జమీన్ పర్' చిత్రం ఓటీటీలోకి వచ్చేసింది. పాపులర్ స్ట్రీమింగ్ ఫ్లాట్‌ఫామ్ అయిన యూట్యూబ్‌లో ఈ సినిమా ప్రస్తుతం పే-పర్-వ్యూ మోడల్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. కేవలం రూ.100లకే ఈ సినిమాను ఫ్యామిలీ మొత్తం కలిసి చూడవచ్చని చిత్రబృందం వెల్లడించింది. సాధారణంగా సినిమాలు థియేట్రికల్ రన్ తర్వాత నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్, జియో హాట్‌స్టార్ వంటి మేజర్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో విడుదలవుతున్న విషయం తెలిసిందే. అయితే, ఆమిర్ ఈ సంప్రదాయాన్ని పక్కనపెట్టి, నేరుగా అందరికి అందుబాటులో ఉన్న ఓటీటీ వేదిక యూట్యూబ్‌లో సినిమాను విడుదల చేశాడు. అయితే ఈ వినూత్న విధానం ప్రేక్షకులకు ఎంతవరకు చేరువవుతుందో వేచి చూడాలి. ఎందుకంటే యూట్యూబ్ కూడా ఓటీటీ ప్లాట్‌ఫామ్ అవ్వడం వలన.. పెద్ద తేడా ఏమి ఉండదని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇంతకుముందు వచ్చిన పలు హాలీవుడ్ సినిమాలు కూడా ఇలాగే యూట్యూబ్‌లో విడుదల చేశాయని సినీ వర్గాలు అంటున్నాయి.



## మూడో వ్యక్తి ప్రాణం తీసిన 100 రూపాయలు

ఇద్దరు వ్యక్తుల మధ్య నెలకొన్న వంద రూపాయల వివాదం మూడో వ్యక్తి ప్రాణం తీసింది. ఈ సంఘటన పెద్దపల్లి జిల్లాలోని రామగుండం ప్రాంతంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం--- గోదావరిఖనిలోని ఎన్‌టిపిసి పర్మినెంట్ టౌన్‌షిప్‌లో వలస కూలీలు ఓ షెడ్డు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. వలస కూలీలు నిర్మాణ పనులు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఒక వ్యక్తి మరో వ్యక్తి మూడు వందల రూపాయలు ఇచ్చాడు. అప్ప ఇచ్చిను వ్యక్తి తిరిగి 200 రూపాయలు ఇచ్చాడు. ఇంకా వంద రూపాయల ఇద్దరు మధ్య గొడవ జరిగింది. ఘర్షణ తారాస్థాయికి చేరుకోవడంతో వినోద్ బుద్ధాజీ సొంకార్(44) వాళ్లకు నచ్చ జెప్పి సర్దిచెప్పాడు. దీంతో వినోద్‌పై ఇద్దరులో మనోజ్ అనే వ్యక్తి కోపం పెంచుకున్నాడు. మనోజ్ అర్ధరాత్రి ఐరన్ రాడ్డు తీసుకొని వినోద్ తలపై బాదాడు. తెల్లవారుజామున వినోద్ రక్తపు మడుగులో కనిపించడంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తగ్గిన గ్యాస్ సిలిండర్ ధరలు.. నేటి నుంచి అమలు




వాణిజ్య అవసరాలకు వినియోగించే 19 కేజీల ఎల్పీజీ సిలిండర్ ధర మరోసారి తగ్గింది. ప్రతి నెల ఒకటో తేదీన సిలిండర్ ధరల్లో మార్పులు చేస్తున్న ఆయిల్ కంపెనీలు.. తాజాగా వాణిజ్య సిలిండర్ ధరను రూ.33.50 తగ్గించాయి. తగ్గిన ధరలు నేటి (శుక్రవారం) నుంచే అమల్లోకి రానున్నాయి. అయితే గృహ అవసరాలకు వినియోగించే 14.2 కేజీల సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేదని ఆయిల్ కంపెనీలు స్పష్టం చేశాయి.



## హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుపై సస్పెన్షన్ వేటు

హైదరాబాద్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు జగన్మోహన్‌రావుపై సస్పెన్షన్ వేటు పడింది. ఆర్థిక అవకతవకలు, నిధుల దుర్వినియోగం, ఫోర్జరీ ఆరోపణలు, అధికార దుర్వినియోగానికి సంబంధించిన తీవ్రమైన ఆరోపణల నేపథ్యంలో హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ ఈ నిర్ణయం తీసుకుంది.ఈ సస్పెన్షన్ తక్షణమే అమల్లోకి వస్తుందని, తదుపరి విచారణ పూర్తయ్యే వరకు జగన్మోహన్‌రావు హెచ్‌సీఏ కార్యకలాపాల్లో పాల్గొనరాదని ఆదేశించింది. ప్రస్తుతం హెచ్‌సీఏ వ్యవహారాలను తాత్కాలికంగా అపెక్స్ కౌన్సిలే పర్యవేక్షిస్తోంది. ఆర్థిక అవకతవకలు, నిధుల దుర్వినియోగం: జగన్మోహన్‌రావుతో పాటు కార్యదర్శి ఆర్. దేవరాజ్, కోశాధికారి సి.జె. శ్రీనివాస్‌రావులపై నిధుల దుర్వినియోగం, ఫోర్జరీ, మోసం వంటి తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. సుమారు రూ.2.3 కోట్ల నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపణలున్నాయి. క్రికెట్ బంతులు, క్యాటరింగ్ సేవలు, ఎలక్ట్రికల్ మెటీరియల్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని ఆరోపణలున్నాయి.ఫోర్జరీ ఆరోపణలు: 2023 హెచ్‌సీఏ ఎన్నికల్లో పోటీ చేయడానికి జగన్మోహన్‌రావు ఫోర్జరీ చేసిన క్రికెట్ క్లబ్ సభ్యత్వాన్ని ఉపయోగించారని ఆరోపణలున్నాయి. గౌలిపురా క్రికెట్ క్లబ్ నకిలీ సభ్యత్వాన్ని సమర్పించారని సీఐడీ అధికారులు గుర్తించారు.ఐపీఎల్ టికెట్ల వివాదం 2025 ఐపీఎల్ సీజన్ సందర్భంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) యాజమాన్యాన్ని అదనపు కాంప్లిమెంటరీ టికెట్ల కోసం బ్లాక్‌మెయిల్ చేశారని ఆరోపణలున్నాయి. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం సామర్థ్యంలో 10 శాతం (3,900 టిక్కెట్లు) ఇవ్వాలని ఒప్పందం ఉన్నప్పటికీ, జగన్మోహన్‌రావు అదనంగా టిక్కెట్లు డిమాండ్ చేశారని ఎస్ఆర్‌హెచ్ ఆరోపించింది. ఈ విషయమై ఎస్ఆర్‌హెచ్ బీసీసీఐ, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌కు లేఖ రాసింది.బీసీసీఐ లోధా కమిటీ సిఫార్సుల ఉల్లంఘన: బీసీసీఐ లోధా కమిటీ సిఫార్సుల మేరకు హెచ్‌సీఏలో అమలు చేయాల్సిన మార్పులను జగన్మోహన్‌రావు అడ్డుకున్నారని, పాలనలో పారదర్శకత లోపించిందని అపెక్స్ కౌన్సిల్ ఆరోపించింది. నిధుల దుర్వినియోగం, ఫోర్జరీ ఆరోపణలపై జగన్మోహన్‌రావుతో పాటు కార్యదర్శి ఆర్. దేవరాజ్, కోశాధికారి సి.జె. శ్రీనివాస్‌రావు, సీఈఓ సునీల్ కాంత్, జనరల్ సెక్రటరీ రాజేందర్ యాదవ్, ఆయన భార్య జి. కవితలను తెలంగాణ సీఐడీ ఇటీవల అదుపులోకి తీసుకుంది. వారిపై సెక్షన్ 465 (ఫోర్జరీ), 468 (మోసం కోసం ఫోర్జరీ), 471 (ఫోర్జరీ చేసిన పత్రాన్ని ఉపయోగించడం), 403 (ఆస్తిని అక్రమంగా వినియోగించుకోవడం), 409 (పబ్లిక్ సర్వెంట్ ద్వారా క్రిమినల్ నమ్మక ద్రోహం), 420 (మోసం) కింద కేసులు నమోదయ్యాయి.ఈ పరిణామాల నేపథ్యంలో వైస్ ప్రెసిడెంట్ దల్జీత్ సింగ్ తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ఈ వ్యవహారం తెలంగాణ క్రికెట్ వర్గాల్లో సంచలనం సృష్టించింది. రాబోయే రోజుల్లో అపెక్స్ కౌన్సిల్ మరిన్ని సమావేశాలు నిర్వహించి, తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనుంది. క్రికెట్ కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని హెచ్‌సీఏ పేర్కొంది.



## శ్రీశైలం ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి

శ్రీశైలం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ నేపథ్యంలో అధికారులు 8 గేట్లను ఎత్తి, దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ దృశ్యాన్ని చూసేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు ప్రాజెక్టు వద్ద సందడి చేస్తున్నారు. గేట్ల ద్వారా నీరు ప్రవహిస్తున్న విజువల్స్ అందరినీ మంత్రముగ్ధులను చేస్తున్నాయి. వాటిని ఆస్వాదిస్తూ సందర్శకులు సెల్ఫీలు, వీడియోలు తీసుకుంటూ ఆనందంగా సమయాన్ని గడుపుతున్నారు.



## రేపటి నుంచి టీచర్ల పదోన్నతులు

రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించిన షె డ్యూల్ వెలువడింది. శనివారం(ఆగస్టు 2) నుం చి ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ ప్రారం భం కానుంది. ఆగస్టు 11 వరకు దీనిని పూర్తి చే యాలని నిర్ణయించింది. మొత్తం 10 రోజుల్లో టీ చర్ల ప్రమోషన్ల పూర్తి కానున్నాయి. ఈ నెల 2వ తేదీన గ్రేడ్ 2 గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు పోస్టుల ఖాళీల వివరాలు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్ల సీజియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. 3వ తేదీన సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి 4,5 తేదీలలో తుది సీనియారిటీ జాబితాను ఖరారు చేస్తారు. ఈ నెల 6వ తేదీన గ్రేడ్ 2 గెజిటెడ్ హెడ్ మాస్టర్ల పదోన్నతులకు స్కూల్ అసిస్టెంట్లు వెబ్ ఆప్షన్ల నమోదు కు అవకాశం కల్పించారు. అదేరోజున వెబ్ ఆప్షన్లలో సవరణకు అవకాశం ఇచ్చారు.

## నడుమందాలతో పిచ్చెక్కిస్తున్న అమైరా

యంగ్ బ్యూటీ అమైరా దస్తూర్ నెట్టింట మరో గ్లామరస్ ఫొటో షూట్ షేర్ చేసింది. బ్లాక్ డ్రెస్ లో నడుమందాలతో కుర్రకారును ఫిదా చేస్తోంది. ఈ ఫొటోలపై మీరూ ఓ లుక్కేయండి.అమైరా తెలుగు, హిందీ, పంజాబీ, తమిళ్ చిత్రాలలో నటించి గుర్తింపు తెచ్చుకుంది.సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టీవ్ కనిపించే ఈ బ్యూటీ తరచూ తన ఫ్యాషన్ సెన్స్ ప్రదర్శిస్తూ నెటిజన్లను ఆకట్టుకుంటుంది.తాజాగా బ్లాక్ డ్రెస్ లో నడుమందాలతో కుర్రకారును ఫిదా చేస్తోంది ఈ బ్యూటీ.అమైరా హిందీలో 'ఇసాక్' తో అరంగేట్రం చేసింది. ఆ తర్వాత హిందీతో పాటు ఆమె తమిళం, తెలుగు సినిమాలలో కూడా మెరిసింది.2018లో విడుదలైన 'మనసుకు నచ్చింది' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యింది. ఆ తర్వాత 'రాజుగాడు' సినిమాలో నటించింది.



## సర్కార్ చేతికి కాళేశ్వరం నివేదిక



కాళేశ్వరం కమిషన్ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్ర ఘో ష్ గురువారం రాష్ట్ర ప్రభుత్వానికి తన నివేదికను అందజేశారు. కాళేశ్వరం ఎత్తిపోత ల పథకం(కెఎల్ఐఎస్)లో జరిగిన అవకతవకలు, నిర్మాణ లోపాలపై విచారణ జరిపిన జస్టిస్ ఘోష్ ఏకసభ్య కమిషన్ తన నివేదికను బూర్గుల రామకృష్ణారావు భవన్‌లోని ఎనిమిదో అంతస్థులోని తన కార్యాలయంలో నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జాకు అందజేశారు. క మిషన్ చైర్మన్ జస్టిస్ ఘోష్ దాదాపు 650 పేజీలతో పైగా ఉన్న తననివేదికను మూ డు వ్యాల్యూమ్స్‌ను సీల్డ్ కవర్లలో పెట్టి స్వయంగా రాహుల్ బొజ్జాకు అందజేశా రు. జస్టిస్ ఘోష్ నివేదిక ప్రభుత్వానికి చే రడంతో ముమ్మందు ఎలాంటి పరిస్థితులు ఉంటాయనేది అందరిలో ఆసక్తిని కలిగిస్తోంది. జస్టిస్ ఘోష్ నుంచి కాళేశ్వరం కమిషన్ రిపోర్టులను స్వీకరించిన వెంటనే వాటితో రాహుల్ బొజ్జా సచివాలయానికి చేరుకున్నారు. విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుకు చెప్పి ఒక వ్యాల్యూమ్‌ను చీఫ్ సెక్రెటరీకి అందజేసినట్లు సమాచారం. తదుపరి కాళేశ్వరం కమిషన్ అందరిలో ఆసక్తిని కలిగిస్తోంది. జస్టిస్ ఘోష్ నుంచి కాళేశ్వరం కమిషన్ రిపోర్టులను స్వీకరించిన వెంటనే వాటితో రాహుల్ బొజ్జా సచివాలయానికి చేరుకున్నారు. విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుకు చెప్పి ఒక వ్యాల్యూమ్‌ను చీఫ్ సెక్రెటరీకి అందజేసినట్లు సమాచారం. తదుపరి కాళేశ్వరం కమిషన్ రిపోర్టు ప్రభుత్వానికి అందినట్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావు తెలియజేసినట్లు తెలిసింది.